క్లుప్తంగా

సుందరేశ్వరునికి లక్షపత్రి పూజ



గోష్పాద క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని బాలా త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. గోష్పాద క్షేత్రం లక్షపత్రి పూజా కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి లక్షపత్రి పూజ చేశారు. ఉదయం గణపతి పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి శ్రీసూక్త విధానంలో సామూహిక కుంకుమ పూజలు, 1,000 తామర పూలతో అమ్మవారికి అర్చన చేశారు. అనంతరం స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. లక్షపత్రి పూజా కమిటీ అధ్యక్షుడు అనుపిండి చక్రధరరావు, ఆలయ ప్రధానార్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి, సుందర గణేష్, పండితులు తెన్నేటి సూర్యనారాయణమూర్తి, వేమూరి శ్రీరామచంద్రమూర్తి, కలిగొట్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన

నిడదవోలు: మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో లక్ష బిల్వార్చన, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్ర నామ పూజలు వైభవంగా నిర్వహించారు. పట్టణ నలుమూలల నుండి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సోమాల శివ, ప్రధానార్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

నిడదవోలు రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ వారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,15,383 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ ఈఈగా చంద్రశేఖర్



కొవ్వూరు: గృహ నిర్మాణ శాఖ కొవ్వూరు డివిజన్ ఈఈగా ఎస్.చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈయన నిడదవోలు డీఈగా పని చేస్తూ, పదోన్నతిపై కొవ్వూరు ఈఈగా బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఈఈ పరశురామ్ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు.

వరద బాధితులకు బుద్ధ విహార్ సహాయం



వరద బాధితులకు ఆహారం పంపిణీకి ఉండ్రాజవరం మైత్రేయ బుద్ధ విహార్ నుంచి పయనమవుతున్న వ్యాన్

ఉండ్రాజవరం: విజయవాడలోని వరద బాధితులకు ఉండ్రాజవరంలోని బౌద్ధ ధమ్మ పీఠం–మైత్రేయ బుద్ధ విహార్ ఆదివారం 2,000 పులిహోర పొట్లాలు, 2,000 మంచినీటి వాటర్ బాటిల్స్, పాలు పంపిణీ చేసింది. ఈ విషయాన్ని బౌద్ధ ధమ్మపీఠం నిర్వాహకుడు బంతేజీ అనాలియో తెలిపారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలైన సింగ్ నగర్, సుందరయ్య నగర్, కండ్రిక, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లోని బాధితులకు వాటిని అందించినట్టు ఆయన తెలిపారు. వరద బాధితులకు సహాయం చేయదలచిన దాతలు 93929 80666 అనే సెల్ నంబర్‌లో బౌద్ధ ధమ్మపీఠాన్ని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మల్లిన శ్రీనివాసరావు, బూరుగుపల్లి కళారావు, గంటి వెంకట్రావు, నందిన రమేష్, కోటిపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'మానవత ' ఆర్థిక సాయం

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన యండపల్లి చంద్రశేఖర శ్రీనివాస్ (14) అనే బాలుడు పుట్టుకతోనే హార్మోన్ల సమస్యతో బాధపడుతున్నాడు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆదివారం రూ.6 వేల ఆర్థిక చేసింది. మానవత సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ చేతుల మీదుగా ఈ సాయం అందజేశారు.

గణపతి భక్తి .. ఎందరికో భుక్తి

- గణనాథుడి నవరాత్ర వేడుకలతో వివిధ వృత్తుల వారికి ఉపాధి
- 7 నుంచి చవితి ఉత్సవాలు ప్రారంభం
- కళాకారులకు, కార్మికులకూ చేతి నిండా పని



నిడదవోలు పూజా గణపతి కుమారస్వామి ఆలయం వద్ద బుట్టబొమ్మల ప్రదర్శన (ఫైల్)



పూజా గణపతి కుమారస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 20 అడుగుల విగ్రహం ఊరేగింపు (ఫైల్)

నిడదవోలు: పల్లె, పట్నం అనే భేదం లేకుండా అన్ని ప్రాంతాలూ వినాయక చవితి వేడుకలకు సమాయత్తం అవుతున్నాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రతి ప్రధాన కూడలి వద్దా నవరాత్ర ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పిల్లలు, యువకులే కాదు స్థానిక వృద్ధులు సైతం ఈ వేడుకల్లో భాగస్వాములవుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల రాట ముహూర్తాలు కూడా చేశారు. తొమ్మిది రోజులపాటు గణపతి పూజలు, ఆ తర్వాత నిమజ్జనాలు, అన్న సమారాధనలతో దాదాపు నెలంతా సందడిగా ఉంటుంది. కాగా గణనాథుని వేడుకలు కేవలం భక్తికే పరిమితం కాకుండా ఎన్నో వృత్తుల వారికి, కళాకారులకు భుక్తి కూడా కల్పిస్తున్నాయి.

ఊరూవాడా సందడే సందడి

కొవ్వూరు డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో 400కు పైగా మంటపాలు ఏర్పాటు చేసి గణనాథుడిని పూజిస్తారు. తొమ్మిది రోజుల పాటు అంగరంగా వైభవంగా పూజలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో విగ్రహాలు తయారు చేసే కళాకారులు, పందిళ్లు వేసే కూలీలు, పత్రి విక్రయించే వారు, ఎలక్ట్రీషియన్లు, సౌండ్ సిస్టం, మంటపాల డెకరేషన్, విద్యుత్ దీపాలంకరణలు, మందుగుండు సామగ్రి, పూల దుకాణాలు, లడ్డూ తయారీదారులతో పాటు స్వామి వారికి పూజలు చేసే పూజారులు, ఊరేగింపులు జరిగే ఆటోవాలాలకు ఉపాధి దొరుకుతుంది.

కళాకారులకు డిమాండ్

గణపతి నవరాత్ర ఉత్సవ మంటపాల వద్ద నిర్వాహకులు రోజూ రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. తొమ్మిది రోజులూ పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలు, నృత్య ప్రదర్శనలు, మ్యూజికల్ నైట్ వంటి ప్రదర్శనలు ఉంటాయి. నాటకాలు ప్రస్తుతం దాదాపు అంతరించే దశకు చేరుకున్నాయి. కేవలం పౌరాణిక, చారిత్రక నాటకాల ప్రదర్శనపైనే ఆధారపడి జీవనం సాగించే కళాకారులకు తమ కళను ప్రదర్శించే అవకాశం, ఉపాధి దొరుకుతాయి. ఏడాదంతా ఖాళీగా ఉన్న కళాకారులు తమ ప్రతిభకు పదును పెడతారు. నాటకరంగ కళాకారులకే గాకుండా కోలాటం బృందాలకు, నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ, మ్యాజిక్ షోలు చేసే వారికి, సన్నాయి వాయిద్యకారులకు, కూచిపూడి, భరతనాట్య కళాకారులకు కూడా చేతినిండా పని లభిస్తుంది.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు గణేశ్ చౌక్ సెంటర్లోని శ్రీపూజాగణపతి కుమారస్వామి ఆలయం వద్ద 102 వ నవరాత్ర వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇక్కడే భారీ ఎత్తున వేడుకలు నిర్వహిస్తారని ప్రతీతి. కోయ నృత్యాలు, శక్తి వేషాలు, సినీ ఆర్కెస్ట్రా, కంజరి కథ, వీధి నాటకాలు, కూచిపూడి, భరతనాట్యం, మిమిక్రీ, మ్యాజిక్ షో, ఆర్కెస్ట్రా వంటివి ఏర్పాటు చేస్తారు. ఈ విధంగా ఇక్కడి ఉత్సవాలు ఎందరో కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నాయి.

కళాకారులను ప్రోత్సహిస్తున్నాం



పట్టణంలో 102వ గణపతి నవరాత్ర ఉత్సవాలను అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం. ఈ సందర్భంగా రోజూ రాత్రి వేళల్లో భారీ ఎత్తున వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. పౌరాణిక నాటకాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇక్కడ తప్పకుండా ఉంటాయి. వాటితో పాటు లైటింగ్, భారీ పందిళ్ల ఏర్పాటుతో ఈ ఉత్సవాల పేరుతో చాలామంది కళాకారులు, కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

– కారింకి సాయిబాబు, పూజాగణపతి కుమారస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు, నిడదవోలు

పనికి లోటుండదు



నిడదవోలు ప్రాంతంలో అనేక చోట్ల వినాయక మంటపాలు ఏర్పాటు చేస్తారు. వాటిని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తాం. అవి కళకళలాడుతూ వెలుగుతూ ఎంతో ముచ్చటగా ఉంటాయి. ఈ క్రమంలో దాదాపు పది రోజుల పాటు ఎలక్ట్రీషియన్లకు చేతినిండా పని ఉంటుంది.

– పడమటి రామకృష్ణ, ఎలక్ట్రీషియన్, పెండ్యాల

30 ఏళ్లుగా బుట్టబొమ్మల ప్రదర్శన



వినాయక చవితి వేడుకల్లో కోయ నృత్యాలు, బుట్టబొమ్మలు, ఆది పరాశక్తి వేషాల ప్రదర్శనల ద్వారా 30 ఏళ్లుగా ఉపాధి పొందుతున్నాను. నాతో పాటు 30 మందికి తొమ్మిది రోజులూ పని దొరుకుతోంది. ఎంతో అంకితభావంతో ప్రదర్శనలు ఇస్తాం. దసరా, ఉగాది పండగల్లో కూడా మాకు పని దొరుకుతుంది.

– పోతుల రాధాకృష్ణమూర్తి, బుట్టబొమ్మల కళాకారుడు, ఉండ్రాజవరం

నేడు కొవ్వూరులో వైఎస్సార్ వర్ధంతి

కొవ్వూరు: పట్టణంలోని మెరక వీధి వాటర్ ట్యాంక్ జంక్షన్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించే మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు కోరారు. వైఎస్సార్ వర్ధంతిని గ్రామాల్లో నిర్వహించుకున్న అనంతరం ఉదయం పదిన్నర గంటలకు కొవ్వూరులో ప్రారంభం అవుతుందన్నారు.

కరాటేలో తపస్వీరెడ్డికి గోల్డ్ మెడల్స్



బంగారు పతకాలతో తపస్వీరెడ్డి

నిడదవోలు: పట్టణానికి చెందిన విద్యార్థి కుంచాల తపస్వీరెడ్డి కరాటే పోటీల్లో సత్తా చాటి బహుమతులు గెలుచుకున్నాడు. రాష్ట్రస్థాయి 8వ స్టేట్ గోజురియో కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల అండర్–14, బ్లాక్ బెల్ట్ విభాగంలో కటా, కుమిటి, టీమ్‌కటా విభాగాల్లో అతడు మూడు బంగారు పతకాలు సాధించాడు. ఆంధ్ర ప్రదేశ్ గోజోరియో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిగూడెం మండలంలోని శ్రీసాయి సేవాసమాజ్ కల్యాణ మండపంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్విరెడ్డిని పలువురు అభినందించారు.

గౌడ సామాజిక భవనం ప్రారంభం



బందపురంలో ప్రారంభోత్సవ శిలా ఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ

దేవరపల్లి: మండలంలోని బందపురంలో నిర్మించిన గౌడ సామాజిక భవనాన్ని ఆదివారం సర్పంచ్ కాట్రగడ్డ పరమేశ్వరరావు (గాంధీ) ప్రారంభించారు. ఎంపీ నిధులు, పంచాయతీ నిధులు రూ.10.75 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో గాంధీ మాట్లాడుతూ అప్పటి ఎంపీ మురళీమోహన్ తన ఎంపీ నిధులు 75 శాతం, గ్రామ పంచాయతీ నిధులు 25 శాతం మంజూరు కాగా భవన నిర్మించామన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి చేసినప్పటికీ ఇప్పటికీ సుమారు రూ. 3 లక్షల మేర బిల్లులు రావలసి ఉందన్నారు. ఈ భవన నిర్మాణానికి మూడు సెంట్ల స్థలాన్ని గౌడ సంఘ నాయకుడు సొంటి శ్రీనివాసరావు తన తండ్రి జ్ఞాపకార్థం ఉచితంగా సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, బీజేపీ నాయకుడు కాట్రగడ్డ రవీంద్ర, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ గాంధీని సన్మానించారు. అనంతరం సొంటి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన తన తండ్రి సత్యనారాయణ విగ్రహాన్ని కొయ్యలమూడి చినబాబు ఆవిష్కరించారు.

ఎర్ర కాలువ ఏటిగట్లు పటిష్టం చేయాలి



కంసాలిపాలెంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

నిడదవోలు రూరల్: భారీ వర్షాలు, విపత్తుల నిర్వహణ హెచ్చరికల దృష్ట్యా బలహీనంగా ఉన్న ఎర్ర కాలువ ఏటిగట్లను పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మండలంలోని కంసాలిపాలెం వద్ద ఎర్ర కాలువ ఏటిగట్లను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎగువ నుంచి వచ్చే వర్షపు నీటితో ఎర్ర కాలువలో ప్రవాహ ఉధృతి పెరిగి అవకాశం ఉందన్నారు. ఏటిగట్ల వద్ద ఇసుక బస్తాలు వేయాలని, ఆయా మార్గాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిస్థితులను బట్టి గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు తగిన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఇరిగేషన్ ఏఈ రాహుల్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

ఎమ్మెల్యేలకు సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అంజేత



కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

కొవ్వూరు: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ అన్ని నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తున్నామని జిల్లా సంఘం అధ్యక్షుడు జోడాల వెంకట్ తెలిపారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి మూడు లక్షలకు పైగా ఉన్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. సీపీఎస్, యూపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ సంఘ నాయకులు విశ్వేశ్వరరావు, ప్రసన్న కుమార్, ప్రకాష్, బాబూరావు తదితరులు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: సీపీఎస్‌ను రద్దు చేయాలంటూ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా మహిళా కార్యదర్శి గుడివాడ దుర్గా భవాని కోరారు. ఈమేరకు రాష్ట్ర సంఘ పిలుపు మేరకు ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆమె కలుసుకుని వినతి పత్రం అందజేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



సత్యవాడ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్

చాగల్లు: సీజనల్ వ్యాధులతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని చాగల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి తనూజ సూచించారు. చాగల్లు సచివాలయం –3 పరిధిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులను ఆమె పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా వంటి రోగాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆమె స్థానికులకు అవగాహన కల్పించారు. శిబిరంలో వైద్యాధికారి మనోజ్, పీహెచ్‌ఎన్ జమీలా, హెచ్‌వీ ప్రభావతి, ఏఎన్‌ఎంలు సీతామహాలక్ష్మి, భారతి, ఎంఎల్‌హెచ్‌పీ ఊహ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి

ఉండ్రాజవరం: జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యుడు ఇర్ఫాన్ సూచించారు. ఆ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సత్యవాడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసారు. వైద్య శిబ్బంది ఎస్‌కే ఖాన్, కె.సుభాషిణి, బ్యూలాజోయ్, మల్లేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్యాజంపూడి - యర్నగూడెం రోడ్డుకు మోక్షం



త్యాజంపూడి వద్ద జరుగుతున్న త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డు నిర్మాణ పనులు

దేవరపల్లి: త్యాజంపూడి–యర్నగూడెం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గోతుల మయంగా ఉన్న ఈ రోడ్డుకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. త్యాజంపూడి నుంచి యర్నగూడెం వరకూ గల ఆర్ అండ్ బీ రహదారి పూర్తిగా గోతులు పడి అధ్వానంగా మారింది. యర్నగూడెం నుంచి నిడదవోలు వరకూ 15 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు నిర్మాణానికి 2015–16లో రూ. 15 కోట్లు మంజూరవగా, నిడదవోలు వైపు నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి వరకూ సింగిల్‌గా ఉన్న ఈ రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే నిడదవోలు నుంచి త్యాజంపూడి గ్రామశివారు వరకూ రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక, నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా రెండు కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. సుమారు రూ. 2 కోట్లకు అంచనాలు రూపొందించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు దుస్థితిపై త్యాజంపూడి గ్రామస్తులు అనేక సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ రోడ్డు తాత్కాలిక మరమ్మతులకు గతేడాది ప్రభుత్వం రూ.70 లక్షలు మంజూరు చేసింది. అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో నిధులు విడుదలకు ఆటంకం ఏర్పడింది. ఇటీవల త్యాజంపూడిలో పర్యటించిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు గ్రామస్తులు రోడ్డు దుస్థితిని వివరించగా, తాత్కాలిక మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రోడ్డును పూర్తిగా తొలగించి గోతులను చదును చేసి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు కొంతవరకూ ఊపిరి పీల్చుకున్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత నిర్మాణం చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామానికి చెందిన చెవ్వూరి రాజేష్ (37) అనే వ్యక్తి పురుగు తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం కుటుంబ కలహాల నేపథ్యంలో ఆగస్టు 25న రాజేష్ పురుగు మందు తాగడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచీ అతడికి వైద్య సేవలు అందిస్తుండగా ఆదివారం మృతి చెందారు. దీనిపై భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.





భారీ వర్షానికి నీట మునిగిన పంటలు

- కాలువలను తలపిస్తున్న రోడ్లు
- నేలనంటిన కూరగాయల పందిర్లు



పెరవలి మండలం బొక్కావారిపాలెంలో నీటమునిగిన వంగతోట



అన్నవరప్పాడులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం



కాపవరంలో నీటమునిగిన రోడ్డు

పెరవలి: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆహార, ఉద్యాన పంటలు నీట మునిగాయి. మెట్ట, పల్లం అనే భేదం లేకుండా అన్ని ప్రాంతాల్లోని పంటల్లో నీరు చేరడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కానూరు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, నడుపల్లి, కాపవరం, అన్నవరప్పాడు, పిట్టలవేమవరం గ్రామాల్లో 270 హెక్టార్లలోని వరి పంట నీట మునిగింది. అలాగే దాదాపు 100 ఎకరాల్లోని కూరగాయల పంటలు నేల నంటి దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. ఇక అరటి, కంద, పసుపు వంటి 100 ఎకరాల్లోని ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు పేర్కొంటున్నారు. దొండ, చిక్కుడు, పొట్ల పందిర్లు నేల నంటడంతో వారు ఘొల్లుమంటున్నారు.

ఛిద్రమైన రోడ్లు

భారీ వర్షాలకు మండలంలోని రోడ్లు మరింతగా ఛిద్రమై కాలువలను తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా నీరే ఉండడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిడదవోలు –నరసాపురం, నల్లాకులవారిపాలెం– ఎర్ర వంతెన, కాపవరం–కొత్తపల్లి అగ్రహారం రోడ్లు కాలువలను తలపించేంత అధ్వానంగా తయారయ్యాయి. గత నాలుగు రోజుల్లో మండలంలో 18 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం ఒక్క రోజే జిల్లాలో అత్యధిక వర్షపాతం 44.4 మిల్లీ మీటర్లు పెరవలి మండలంలోనే నమోదు కావడం విశేషం.